

# కసి

పి.యస్.నారాయణ

[illegible]సం ఒక్కసారిగా వచ్చి పోతున్నావేమో అని ఏడ్చినట్టుగా రైలు కూత కూసింది. వెనకనుంచి వెల్లువ వస్తుంటే ముందుకు పరుగెడుతున్న మను ష్యుల్లా ప్లాట్‌ఫారమ్ మీద జనం ఆగినరైలు మీదకు పోతున్నారు. బాగా వెలుగులో నుంచి ప్లాట్ ఫారమ్ మీదకు వచ్చిన వాళ్ళ కళ్ళు చీకట్లు కమ్మి బూజర్లు బూజర్లుగా ఉన్నాయి.

నలభై కిలోమీటర్ల దూరం తలకు బరు వెక్కించింది. ఏపిడిన్, ఏనాల్జిన్ వేసుకుంటే ఆ తల బరువంతా ఒంట్లోకి జారి పోతుంది. మరో ఏనాల్జిన్‌కి పొట్టలోకి. . . ఆ పైన బెరాల్గన్‌కు కాళ్ళల్లోకి... తరవాత ఎక్కడికి పోతూం డా చెప్పి?

అది కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో అయిదో బోగీ. నేను ఎక్కింది గుంటూరు. వెళ్ళవలసింది హైదరాబాద్. దాటింది ప్రస్తుతం కృష్ణను. గంట ప్రయా ణం జరిగింది. గంటల ప్రయాణం ముందున్నది.

పెద్ద హోట్లో రంగు దీపాల్లా ముగ్గు రమ్మాయిలు నా ముందు సీటు మీద కూర్చున్నారు. రంగు రంగుల చీరెల్లో రంగ వైభవంగా వెలిగి పోతున్నారు ముగ్గురు. ఎర్రగా బంగారు తీగెల్లాగా ఉన్నారు.

ముగ్గురూ విజయవాడ స్టేషనులో ఎక్కిన తరవాత పెట్టెలో నలభై కాండిల్ బలుబులు తీసేసి పెద్ద పెద్ద ట్యూబులైట్లు పెట్టినట్లుంది. చీకటి గదిలోకి మెరుపులా వెలుగు వచ్చినట్లుంది...అప్సరసలు దిగి అమృతం తెస్తే వాళ్ళుతెచ్చిన అమృతాన్ని తాగాలా వాళ్ళ అందానే తాగాలా అనే ఆలోచనతో నోళ్ళు తెరుచుకు కూర్చున్న దేవతల్లాగా కూర్చున్నారు తోటి ప్రయాణీకులు.

అక్కడ దేవతలే కాదు, రాక్షసులూ ఉన్నారు అన్నట్లుగా రెండు సింగిల్ సీటర్లలోనూ ఇద్దరు కుర్రాళ్ళు కూర్చున్నారు. వాళ్ళిద్దరివీ రాక్షస వ్యూహాలేఅన్నట్లుగారెంటినీ తాగేయాలన్నంతఆత్రంగా ఆ ముగ్గురు ముద్దు గుమ్మల్నీ గుడ్లు మిటకరించి చూస్తున్నారు. వాళ్ళకీ రాక్షసులకు మల్లే సైడ్ లాక్స్ ఉన్నాయి. పెద్ద పెద్ద మీసాలు కిందకు జారి ఉన్నాయి. పోలేరమ్మ జాతరలో పూనకం వచ్చిన వాడికి ఉన్న జుట్టులా జుట్టు ఉన్నది. జులాయి వెధవల్లా సిగరెట్టు మీద సిగరెట్టు తెగ కాల్చేస్తున్నారు.

చీకటి ప్లాట్ ఫారమ్ మీదనుంచి రైలు మూలు గుతూ ముక్కుతూ ముందు కొచ్చి వెలుగు నందు కుంది. ఆ పైన స్పీడందుకుంది. ఆపైన మరీ ఈదురుగాలినీ అందుకుంది.

ఆ తరవాత పది నిమిషాలకు ఆ చక్కని చుక్కల్లో చిన్నది చిన్నగా నోరు విప్పి, "హైదరాబాద్‌లో రంభ స్టేషన్‌కు వస్తుందో, రాదో" అన్నది.

రెండో చిన్నది కిసుక్కున ముత్యాలన్నీ ఒక్కసారే ఎక్కడ రాలిపోతయ్యో అన్నంత సుతారంగా నవ్వి, "నీ భయం బండలుగాను—అది రాకపోతే మనం ఇంటికి పోలేమంటే" అన్నది.

ఆ మాట్లాడుతున్న అమ్మాయిల్నే చూస్తున్న ఆ కొంటె కుర్రవాళ్ళ కళ్ళల్లో కసి ఏరులై పారు తున్నట్లే ఉన్నది.

'మూడోది మాట్లాడదేం' అన్నట్లుగ కసిగా ఆ అమ్మాయి వంక చూశారు.

అలా చూస్తున్న వాళ్ళను చూస్తుంటే నా కళ్ళల్లోనూ కసి పరిగెత్తి మెరుక్కా ముందుకూ ప్రాగుతూంది.

కసిగా రైలు ముందుకు ఎవరినో పట్టుకోవాలి అన్నట్లు దూకుతూంది.

ముగ్గు రమ్మాయిల పక్కన ఒక ముసలమ్మ కూర్చున్నది, వాళ్ళకు బాడీ గార్డులా. . . ఉన్న జుట్టుకు తోడు ఒక పెద్ద బన్నుకూడా పెట్టుకుని చిన్న రోలంత చుట్ట చుట్టుకుంది. సినిమాల్లో జమీందారిణిగా వేసినప్పుడుకన్నాంబా, ఎస్. వరలక్ష్మి పెట్టుకునే గోల్డ్ ఫ్రేమ్ కళ్ళజోడు పెట్టుకున్నది. ఆ పైన ఒక శాలువాకూడా కప్పుకున్నది.

అది ఎదురు వరస...

ఇక నా పక్కన ఎలిమెంటరీ స్కూల్లో టీచర్ లాంటి మనిషి ఒకాయన—ఆయన పక్కన ఆస్మా పేషెంటులా గున్నాడు—పూరికినే దగ్గుతున్నాడు... వెధవ గొడవని వెధవ గడవ... నా పక్కన పూర్వమో ఇప్పుడు ముందో అక్కాధికారి లాంటి మనిషి.

పక్కన సింగిల్ సీటర్లలో సరేసరి.

ఇద్దరు వెధవన్నర వెధవలు.

ప్రపంచమంతా గిర్రున తిరుగుతూంటే ఉండలా దొర్లి పోతున్నట్టుగా రైలు వెళ్ళి పోతూంది. పొర్లి కొస్తున్న వరద నీళ్ళల్లో కొట్టుకొస్తున్న గడ్డి పరకల్లా టెలిగ్రాఫ్ తీగెలు కిందకూ పైకీ వూగుతున్నాయి. ఆ వరద నీళ్ళల్లో దొర్లుకుపోతున్న నావల్లా చెట్లు. . .

నాది సరీ దారి పక్క సీటయింది. మావెనకాల్నే లేవటరీ అవటంతో వచ్చే జనం. పోయే జనం.

ముగ్గురు పిల్లలూ మూడు పుస్తకాలు పట్టు కున్నారు. వాళ్ళ కాసరాగా వస్తున్న పెద్దమనిషి ఆవిడగారి జీవితంలోనే రైలు ప్రయాణం చేయ లేదన్నంత వెకిలిగా నోరు తెరుచుకుని గిరగిర లాడు తున్న పరిసరాలను చూస్తూంది.

పెద్ద జులాయి చిన్న జులాయితో ఏదో చెప్పి చిన్న పిల్లలా పెద్దగా ఏడ్చినట్టుగా నవ్వుతున్నాడు. చిన్న జులాయి పెద్దవాడి జోక్ తట్టుకోలేనట్టుగా గుక్క పట్టి తొడ మీద పూరికినే కొట్టుకుంటు న్నాడు.

సిగరెట్ల వాసన...

ఈ పిల్లగాళ్ళకి అన్ని డబ్బులు ఎక్కణ్ణించి వస్తయ్యో?

అమ్మా నాన్నలకు కత్తి చూపించి లాక్కురారు కదా?

"ఎక్కడైనా ఉద్యోగం చేస్తున్నారా?" నేనే కదిలించాను.

"ఎల్లైసీలో నండి. వాడు స్టేట్ బాంకు— ఇద్దరం హైదరాబాదు లోనే" అన్నాడు పెద్ద జులాయి నా వంకోసారి, ఆ అమ్మాయిల వంకో సారి చూస్తూ. "నా పేరు రావణారావు... వాడి పేరు వెంకట్రావు."

"ఎక్కడుంటారు?"

"చిక్కడపల్లి లో."

"పెళ్ళయిందా?"

"పెళ్ళి చూపులకే వెళ్తున్నాం."

చిన్న జులాయి కిసుక్కున బాగా తాగిన వాడు డోక్కున్నట్లుగా నవ్వి ఆ అమ్మాయిలు తన విట్టుకు నవ్వారా లేదా అన్నట్టుగా ముందుకు వంగిఅలా చూశాడు.

నాకు మహా చికాకు వేసింది. గొంగళిపురుగును ఒంటి మీద చేత్తో తెచ్చిలా వేసుకున్నట్లనిపించగా, పక్షి ముండా కొడుకుల్ని పలకరించకుండా ఉండాల్సింది అని మనస్సు లోనే లెంప లేసుకున్నాను.

వెంకట్రావు సినిమా పాట అంకించుకున్నాడు. పాడుతూనే ఆ అమ్మాయిలు వింటున్నారా లేదా అన్నట్టుగా అటు చూస్తూ గాలి లోకి చేతులుకూడా ఊపుతున్నాడు. 'ఆహా ఆహా' అనుకుంటున్నట్టుగా.

రైలు మహా స్పీడుగా—నేల నంతా గిరగిరా తిప్పేస్తూ పోతున్నది.

ఈ నాటి మనుష్యుల్ని వాళ్ళ చేష్టల్ని ఆలోచిస్తూ కళ్ళుమూసుకుంటే మనస్సు నా చిన్నతనంలోకి— ఆ నాటి కట్టుబడి జీవితంలోకి వెళ్ళిపోయింది.

అప్పటి పిల్లలకు ఇంత స్వేచ్ఛ ఉండేదా?

రైలు ఆగింది.

ప్లాట్‌ఫారం అంతా ఖాళీగా ఉన్నది. రైలు ఎందుకు ఆగిందో అర్థం కాలేదు.

నా ఎదురుగా కూర్చున్న అమ్మాయితన చేతిలోని పుస్తకాన్ని పక్క అమ్మాయి ఒళ్ళో పడేసి ఒళ్ళు విరుచుకుంటే — రావణారావు రావాలని తనూ ఒళ్ళు విరుచుకొని — రైలు ఇంజన్ కూతలా అరిచాడు.

పెట్టెలో జనం అంతా వాడి వంక ఒక్కసారి వింతగా చూశారు.

బండి కదల్లేదు రెండు నిమిషాలయినా.

ప్రయాణీకులు ఒక్కరొక్కరే ప్లాట్‌ఫారం మీదకు దిగుతున్నారు. అవుతున్న ఆలస్యాన్ని జోరుగా తిట్టుకుంటూ.

"కాఫీ ... కాఫీ ..." ఒక పదేళ్ళ కుర్రాడు అరుస్తూ వెళుతున్నాడు.

"ఏయ్ ... కాఫీ...ఇటు రా!" రావణారావు పిలిచాడు.

"తీసుకోండి సాబ్ .. ఎన్ని ... రెండా?"

నేను కొద్దిగా లేస్తూ అడిగాను. "బండి మరి ఆగుతుందా చాలాసేపు?"

"క్రాసింగ్ సాబ్...ఇంకా పది నిమిషాలుంటుంది!" కాఫీ గ్లాసు అందిస్తూ అన్నాడు.

తీసుకున్నాను గ్లాసుని ... కాఫీ వేడిగా ఉన్నది.



ఎంతసేపో ....

చిత్రం— మారేమండ శ్రీనివాసరావు


రైలు స్టేషన్ కాఫీని గురించి ఆలోచించాల్సిందే ఉన్నది. సరిగ్గా లేని రుచిని వేడి కప్పిపెడుతుంది. నాలిక కాలుతుంటే టేస్ట్ ఎవడికి పట్టింది?— ప్రయాణంలో దిమ్మెక్కిన తలను వెచ్చటి కాఫీ పళ్ళు చిక్కిస్తుంది.

"మొన్న పద్మ పెళ్ళిలో ఏముయిందంటే ..." రావణారావు మొదలెట్టాడు.

వెంకట్రావు ఆసక్తిగా నోరు తెరచి, "ఎక్కడ?" అన్నాడు.

"గుంటూరులోనే గదా పెళ్ళి ... బ్రాడీపేటలో వాళ్ళ పెద్దనాన్నగారింట్లో జరిగింది!" కాఫీ సిప్ చేస్తూ "అబ్బ కాలుతున్నదిరా... వెధవ ముండాకొడుకులు ఇలా వేడిగా ఇస్తే ఎలా తాగాలి...!" పింగళి సీటర్లు మాటల్లోకి దిగినారు.

"పెళ్ళికొడుకు బాబాయి అమెరికాలో ఉంటాడట. ఆయనగారు చిన్న కాలేసుకుని హైదరాబాద్ నుండి మరీ పెళ్ళికి వచ్చాడు. వాడు అమెరికాలో ఉండి రావటం లేదు గాని వాడి చుట్టూ భజన సంఘాలు బయల్దేరినయి. ఆయన గారు నిల్చుంటే వెనకాల ఇంకొకడు ఒక ఖాళీ కుర్చీ పట్టుకు నిల్చుంటాడు. కూర్చుంటే చేతులు పట్టుకునినిల్చుంటాడు. ఆయన గారు మహా శకలు పోతున్నాడు. ప్రతిదాన్నీ 'డర్టీ ... డర్టీ' అంటున్నాడు. ఇంతా ఏడిస్తే ఆయన అమెరికాలో ఉండి ఏడ్చింది ఆరు నెలలు. భారతదేశాన్ని మొట్టమొదటిసారిగా చూస్తున్నట్టుగా బిహేవ్ చేస్తున్నాడు. ఇప్పుడేముందంటే మా వాళ్ళ దురదృష్టం కొద్దీ ఆయన గారు కాఫీ కావాలి అంటే— ఇదుగో ఇలాంటి వేడి కాఫీ పంపించారు..." అన్నాడు



నా వంక తిరిగి.

"ఆహా" అన్నాను నిర్లిప్తంగా.

ఎదురుగా కూర్చున్న అమ్మాయి కూడా రామా రావు చెబుతున్న కథ వైపుకు ఒక చెవిని పారేసినట్లు ఉన్నా!

"తాగారా సార్!" కాఫీల కుర్రాడు వచ్చాడు.

"ఎలా ఇంత వేడిగా ఇస్తే ఎట్లా తాగుతాం ... తరువాత రాపో!"

నాకు తాగలేనంత వేడి అనిపించలేదు తాగేశాను.

"కాఫీ ... కాఫీ !" కుర్రాడు వెళ్ళిపోయాడు.

వెంకట్రావు కాళ్ళు బారజాపి టీవిగా పాపిలో పడుకున్నట్లుగా కూర్చుని కాఫీ గ్లాసుకు జేబు రుమాలు చుట్టి ఒక్కొక్క చుక్క తాగుతున్నాడు.

"అప్పుడేమయింది?"

"అప్పుడేమయిందయ్యా అంటే — అరేయ్! ఈ సారి ఆ కుర్రాడు వస్తే రెండు పాన్లు తెప్పించరా! అంటూ ఆరంభించాడు రామారావు. అంత పొడుగు జుట్టున్నా ఎడంచేత్తో వెనక్కి నెట్టుకుని సరిచేసు కున్నాడు.

మధ్యలో వెధవ పోజు... బోడి పోజని ...

"వేడి కాఫీ ఇచ్చాడా ... ఒక్కసారి ... అలా అలా అలాగా పొగ్గా పట్టుకొని కప్పెత్తి పెదిమల దగ్గర పెట్టుకున్నాడో లేదో — పెదిమ కాలటమేమిటి— అమెరికా నుంచి తిరిగొచ్చిన పెద్ద మనిషి ఎగిరి గంతేయుట మేమిటి — అరేయ్ పెళ్ళికొడుకూ బాయాయిని కావాలని అమర్యాద చేశార్రా ఈ మర్యాద తెలియని ఆడ పెళ్ళివాళ్ళు... లేవరా పీటల మీద నుంచి అని పెళ్ళి కొడుకు తండ్రి అరవడ మేమిటి— అన్నీ ఒక్కసారే జరిగిపోయినయి..."

"నిజమా?" నాకు చాలా విచిత్రమనిపించింది. ఆ సంఘటన — చాలా సిల్లీగా ఉన్నది!

నాలాగానే అక్కడ కూర్చున్న వాళ్ళంతా గూడా ఆ మాటలకు ఉత్తేజితు లయ్యారని వాళ్ళ ముఖాలే చెబుతున్నాయి ... వాళ్ళ చూపులూ కసిగా ఉన్నాయి. ఆడవాళ్ళవి మరీను!

"నిజమా అంటా రేమిటి, సార్...అక్షరాలా నిజం. ఒకరు చెబితే విని నేను చెబుతున్నది కాదు. నా కళ్ళతో స్వయానా నేను చూసింది— అలా చూచి గూడా ఇంకా ఇరవై నాలుగు గంటలు కాలేదు!"

"అప్పుడు ఏమైంది!" నాకు చాలా ఆసక్తిగా ఉన్నది— ఈ ప్రపంచంలో ఇంకా అలాంటి వెధవ లున్నారా అనుకున్నాను కసిగా.

"కాఫీ ... కాఫీ సార్ ... సార్ ఖాళీ గ్లాసులు డబ్బులు ..."

నేను గ్లాసు డబ్బులు ఇచ్చేశాను — లేచి ముందుకు వంగి.

"ఆగవోయ్ ... ఇంకా తాగడమే మొదలెట్ట లేదు. ఒకటే హడావుడి ... తాగాలా వద్దా? రెండు పాన్లు తెస్తావా!"

"గ్లాసుల దొరకకుండి ...తొందరగా తాగండిసార్! ఎదురుబండి వచ్చేస్తోంది!"

"ఇంకేం చెప్పమంటారు సార్ ... ఆ పెళ్ళి కూతురు వాళ్ళ బాధ! ... వేడిని కాంపెన్సేట్ చేసే టందుకుగాను నాలుగు ఫ్యాన్లు తెప్పించి అక్కడికే ఇస్తామన్నారు. కావాలంటే గుంటూరు శంకర్ విలాస్ ఏసీలో స్పెషల్ ఎటెండర్ తో ఒక రూం ఇప్పిస్తా మన్నారు. ఆ పైన కావాలంటే బీరు ... బ్రాందీ ... రమ్ము ... జిన్ను తెప్పించి ఇస్తా మన్నారు. ఈ పేటం మీద పెళ్ళి చెడగొట్టొద్దన్నారు. చేతులు పట్టుకుంటామన్నారు. కాళ్ళు పట్టుకుంటా మన్నారు. ఊహూ ... వింటేనా ... తను పట్టుకున్న కుందేటికి మూడే కాళ్ళన్నాడు ఆ పెళ్ళి కొడుకు తండ్రి — నా తమ్ముడు స్వయానా నా తమ్ముడు. ఫారిన్ రిటర్న్డ్ ... వెధవకాఫీ ... బోడి కాఫీ ... చెత్త కాఫీ ... ఎక్కడా దొరక్క వాడు ఇక్కడికి వచ్చాడా అన్నాడు. ఇలాంటి కాఫీలు కావాలీ అంటే కుండలతో చేయించి రోడ్డు మీద — రోడ్డు ఆరకుండా పార పోయించే స్తోమత ఉన్నదన్నాడు. అతడి స్టేటస్ ఏమిటన్నాడు... అదేమిటన్నాడు ... ఇదేమిటన్నాడు. మనసూ ... వింటేనా అసలు ... అబ్బే ..."

పెట్టెలో వాళ్ళంతా ఆ ముగ్గురు ముద్దు గుమ్మలతోసహా నోరు తెరుచుకుని రామారావు వంకే చూస్తున్నారు.

రామారావు ఒక్క క్షణ మాగి కాస్త కాఫీ వూదుకుని తాగాడు.

అటువంటి సమయంలోనే పక్క పట్టాల మీదుగా మా నెత్తి మీద ముంచే పోతున్నట్లుగా ఒక రైలు వెళ్ళిపోయింది, కసిగా మా బండిని ఒక వూపు వూపేసి ...

"కా ... కాఫీ, గ్లాసులు సార్ ... డబ్బులు!"

"ఉండు, నాయనా, ఇస్తాను.... వేడి తగ్గాలా ... కాఫీ తాగాలా... ఒక్క గుక్కకే సరిపోతే పైన లిమ్మంటే ఇక్కడేమున్నా పెట్టున కాస్తున్నయ్యా డబ్బులు, తండ్రీ!" గార పళ్ళను బయట పెట్టి ఇకిలిస్తూ అన్నాడు రామారావు.

ఆ కుర్రవాడు ముందు పెట్టెల వైపు పరు గెత్తాడు.

"వినవంటాడే వాడు ఎన్ని చెప్పినా ... పెద్ద మనుష్యులు అనుకున్న ఇద్దరు ముందుకు వచ్చి— అయ్యా ... ఇది కావాలని చేసింది గాదు. కిరాయికి పెట్టిన వంట మనుష్యులు గాడిపొయ్యి మీద కాఫీ దించే పెట్టి మాటల్లో పడిపోతే అవి మరిగి వేడెక్కి నయి. దాన్ని కాస్త పొరపాటున ఆడవాళ్ళు ఒక గ్లాసులో పంచేసి ... ఆలస్యమయితే అమర్యాద అం టారనే భయంతో తెచ్చి ఇచ్చారు. కనుక కావాలని చేసిన తప్పు కాదు. ఈ తప్పును మన్నించి ఈ పెళ్ళిని అనుకున్నట్లుగా చేసేసెయ్యండి. తప్పు చేసిన అందరి తరపున మేం అన్ కండిషనల్ గా క్షమాపణ చెప్పుకుంటున్నాం!... అని రెండు చేతు లెత్తి దణ్ణం పెట్టారు!"

"ఇంత చిన్న విషయానికి అంత పెద్ద రాద్ధాం తమా?" అన్నాను — వింతగా చూస్తూ.

అసలు ఈ వెధవలు వివేవాళ్ళుండరని పూల్స్ చేయటానికి గాని కల్పించి చెప్పటం లేదుగదా!

"పెళ్ళి కొడు కొక వెధవ. లే అనగానే ఏంటి నాన్నా అంటూ పీటల మీద నుంచి లేచేశాడు."

ముగ్గురు ముద్దుగుమ్మలూ కిసుక్కు మన్నారు, ఆ కుర్రవాళ్ళకు కిక్ వచ్చేలా. . .

"పెళ్ళి కూతురు ఏడుపు. పెళ్ళి కూతురు అమ్మ ఏడుపు. పెళ్ళి కూతురు నాన్న ఏడుపు. పెళ్ళి కూతురు అక్క ఏడుపు. చెల్లెళ్ళ ఏడుపు. పాపం, ఏ మాట కా మాటే అనుకోవాలి—పెళ్ళి కొడుకు తల్లికూడా ఒక్కసారి ముక్కు చీదింది."

"కాఫీ గ్లాసులు, సార్. బండికి సిగ్నల్ ఇచ్చారు."

"నాన్నా, తాగమంటావా వద్దా. వద్దా అంటే చెప్పు మానేసి ఇస్తాను."

"తొందరగా తాగండి, సార్."

"కాలుతున్నాయి కదా."

"ఎలాగో అలాగా తాగండి. బండికదిలేలా ఉన్నది."

గంటకూడా మోగింది.

"పెళ్ళి వారంతా లేచారు పాలోమంటూ. . . అప్పుడు నాకు రంగంలోకి దిగక తప్పలేదు. మనిషైన వాడెవడూ చూస్తూ వూరుకోలేడు. మా పెద నాన్ననీ, పెద్దమ్మనీ దాటుకుంటూ వెళ్ళి బ్రాహ్మడి మీదగా ఒక్క దూకు దూకి పెళ్ళి కొడుకు మెడకాయ పట్టుకుని తాళి కట్టు అన్నాను. మా నాన్న నడుగండి అన్నాడు. పద్మతో సంసారం చేసేది మన్నా మా

నాన్నా అన్నాను. నేనే నన్నాడు. అయితే నేను చెబుతున్నాను కదా కట్టేయ్ అన్నాను. మా నాన్న తిడతాడండీ అన్నాడు. మీ నాన్న తిట్టడమే గదా చేసేది అన్నాను. అవునండీ అన్నాడు. అయితే తాళి కట్టకపోతే నిన్ను నేను మర్డర్ చేస్తాను అన్నాను. చేస్తానన్నానండీ. శుభ్రంగా కత్తి తీసుకు వచ్చి పాడి చేస్తానన్నాను. అంతే! టక్కున మంగళ సూత్రాన్ని పట్టి మెళ్ళో కట్టేశాడు. బ్రాహ్మడు ఇంకా లగ్నానికి పది నిమిషాలు టైమ్ ఉందయ్యా మొగుడా అంటాడు. నీ బొందయ్యా—అటు కొంప అంటుకుంటుంటే లగ్న మేమిటని గయ్యిన లేచాను."

"సార్ గార్డు విజిల్ వూదాడు. గ్లాసులు డబ్బులు ఇవ్వండి, సార్."

"ఆగాడు, బాబూ... ఒక్క నిమిష మాగుతావా?"

"అయ్య బాబోయ్, బాబూ" అన్నాను కాస్త మందలింపుగా, పాపం, ఆ కుర్రవాడు ఏడుపు ముఖం పెట్టేస్తున్నాడు.

"ఆగా రుండండి, సార్... ఇస్తా మండరా—అరేయ్. . . అప్పుడేం చేశానంటే—పెళ్ళి కొడుకు పెళ్ళి కూతురు మెళ్ళో ఆ మూడు ముళ్ళూ వెయ్యగానే అతిథులకు దూరాలేసి, బాబులూ, పెళ్ళి కొడుకు తలవు పెద్దలూ మీ ఇష్టం. పెళ్ళయితే అయిపోయింది. మీ రున్నా సరే, వెళ్ళి పోయినా సరే. ఏభై పది నిమిషాల్లో తేల్చి చెప్పేయండి. ఇంకా వియ్యం ఎవట్నో పొయ్యలేదు. మీరు వెళ్ళిపోతామూ అంటే మీ అందరికీ అన్నం వడ్డించటమూ దండగ... తొందరగా తేల్చేయండి" అని ఖచ్చితంగా చెప్పేశాను కిమ్మన్నాస్తే. నోరెత్తితే నా గాడిద కొడుకు ఒక్కడైనా. ఫారెస్‌గాడు కనబడితేనా... పారిపోయి వస్తున్నాడు తుపాకీ గుండుకుకూడా దొరక్కుండా."

రైలు పెట్టెలో ప్రాపిరి దగ్గట్టుకు కూర్చున్న జనాని కంతటికీ పెద్ద రిలీఫ్."

"మంచి పని చేశారు. బుద్ధి వచ్చేలా చేశారు." అన్నారు, ముగ్గురు నలుగురూ కూడా.

బండి కదిలింది—చిన్నగా జర్క్ ఇస్తున్నట్లుగా వూగి.

"సార్! బండికదులుతూంది. గ్లాసు ఇస్తారా ఇవ్వరా?"

"ఏంమాట్లాడుతున్నావురా...గ్లాసు ఇవ్వనవా... నీ గ్లాసుని నేనేం చేసుకుంటానురా... వేడిగా ఉన్నది గదా ... తాగాలా వద్దా అంటున్నాను. తాగేసి యిస్తాను. ఏం—వూరికే అన్నున్నావా నువ్వు!" కాస్త పదుమైత్తి కంఠం పెంచాడు.

నాకు అతడి ప్రవర్తన అన్యాయంగా ఉన్న ట్టనిపించగా అతడి వంక విసుగ్గా చూశాను.

"మరి బండిపోతుంటే ఎట్లా? సార్!"

"ఇస్తానన్నానా ... తొందరపడపోకు!" ఒక్క గుక్క తాగాడు.

తోటి ప్రయాణీకులంతా వింతగా ... కుతూహలంగా ఒకరి వంకొకరు చూస్తున్నారు. ఎదురుగా కూర్చున్న ముగ్గురు అమ్మాయిలు గూడా కళ్ళు పెద్దవి చేసుకుని కుతూహలంతో అతడినే చూస్తున్నారు.

చిన్న జలాయి గ్లాసు ఇచ్చేశాడు.

పెద్ద జలాయి గ్లాసులో సగంకాఫీ ఇంకా అలాగే ఉన్నది.

"మీరుగూడా ఇవ్వండి, సార్ ... తొందరగా డబ్బులుగూడా!"

"హమ్మయ్య! ఇప్పటికి కాస్త వేడితగ్గింది.ఇస్తానుండు!" గ్లాసెత్తి రెండు గుక్కలు తాగాడు రామారావు.

బండి ఫ్లాట్‌ఫారంమీదజారిపోతూంది చిన్నగా—పాచిపట్టిన బండల మీద కాలు జారుతున్నట్లుగా!

కాఫీల కుర్రాడు కిటికీ పట్టుకుని రైలుమ్మట నడుస్తున్నాడు.

పెట్టెలో వాళ్ళ అందరి కళ్ళూ వాళ్ళమీదే ఉన్నాయి.

"ఈ స్టేషన్లలో కాఫీలతో ఇదే గొడవ,సార్... వెధవ వేడి నీళ్ళు పోస్తారు ... డబ్బులకు డబ్బులూ ఎక్కువే ... వెధవలు ఎట్లా ఉన్నా తాగేస్తారని వాళ్ళ ఉద్దేశం ..." అంతేనా?"

"గ్లాసు ఇవ్వండి, సార్ ముందు...డబ్బులుగూడా మా సేటు తంతాడు!"

"ఇస్తా నంటున్నానా ... ఆగు!"

బండి స్పీడందుకుంది.

చుట్టూ ఉన్న వాళ్ళందరినీ చెప్పిన కథతో ఆకట్టుకొని గొప్పవాడయిపోయిన ఆ పెద్ద జలాయి ప్రవర్తన నాకు చాలా అసహ్యమనిపించింది.

కాఫీ బాగుండకపోతే అంతసేపు తాగడం దేనికి ? అసలు ఆ కాఫీ అలా ఉంటుందని తెలిసీ తాగుతూ వాటినపాడుతున్నాడూ అంటే ఆ వెధవన్నర వెధవలను ఏమనుకోవాలి...

"ఇవ్వండి సార్ ... సేటు తంతాడు! పెట్టె పట్టుకుని పరుగెత్తుతున్న వాడి కంఠంలో ఏడుపు స్పష్టంగా వినిపిస్తోంది.

ఆ కుర్రవాడే పెద్దవాడయినట్లయితే ఇతగాడు ఇట్లా ఏడిపించ గలిగేవాడా?

ప్రయాణీకులంతా బొమ్మల్లా మెడలు తిప్పి అటు వంచి — వంగిన కిటికీల్లో నుంచి చూస్తున్నారు.

పెద్ద జలాయి పళ్ళన్నీ బయట పెట్టి గొప్పగా ఇకిలించాడు.

"ఏయ్ ... తొందర చేశావంటే అవలిస్తాను!" అన్నాడు — మెడ అటూఇటూ తిప్పుతూ.

స్టేషన్ కున్న ఆఖరి బల్లం ఫెన్సింగ్ వెనక్కు వెళ్ళిపోతున్నది. స్టేషన్ బయట ఉన్న క్వార్టర్స్ గిర గిరా తిరుగుతూ వెనక్కు పరుగెత్తుతున్నాయి.

ఏనా భోగీ ఏ క్షణానైనా ఫ్లాట్‌ఫారం దాటి వెళ్ళిపోతుంది.

బండి స్పీడుతోపాటు ఆ కుర్రవాడి ఏడుపుగూడా పెరుగుతోంది.

"ఇవ్వండిసార్ ... ఇవ్వండి!" అరుస్తున్నట్లుగా అన్నాడు.

ఏడుపును అదిమి మింగ గలిగితే కోపం పుట్టుకొస్తుంటే నేది నిజం!

"ఇస్తానులేరా బాబో ... ఎందు కేడుస్తావ్!"

"మా సేటు నన్ను తంతాడు సార్... మీరు డబ్బు లివ్వక పోయినా తంతాడు. ఖాళీ గ్లాసు ఇవ్వక పోయినా తంతాడు. ఖాళీగ్లాసూ డబ్బులూ ఇవ్వక పోయినాతంతాడు. ఒక కప్పు కాఫీకి డబ్బులుపోయినా తంతాడు. సార్ ... రెండు కప్పుల కాఫీకి డబ్బులు పోయినా తంతాడు. ఒక గ్లాసు మూడు కప్పుల కాఫీ పోయినా తంతాడు... ఒక గ్లాసు కయినా ఒకే తన్నులు... రెండు గ్లాసుల కయినా ఒకే తన్నులు ... పది గ్లాసులకయినా ఒకే తన్నులు ... నాలుగు గ్లాసుల కాఫీ అయినా ఒకే తన్నులు... మీరేంబాగు పడతారు, సార్... నా ఉసురుపోసుకు చస్తారు. నా ఏడుపుకు గుండాగి చస్తారు. మా సేటు దెబ్బలకు నే నేడుస్తాను... నా ఏడుపుకు మీరు చస్తారు ... మీ చావుకు మీ వాళ్ళంతా ఏడుస్తారు ... చాలండి సార్ ... ఇదుగో ఇంకో గ్లాసు కాఫీ కూడా నీ ముఖాన పోస్తున్నాను ... సంతోషించు. ఛావరా గాడిదకొడకా చావు!" పెట్టె పట్టుకు పరుగెత్తుతున్న వాడల్లా — పరిగెడుతూనే కిటికీ మీద నుంచి చేయిజాపి రెండు చేతిలో ఉన్న కాఫీ గ్లాసుల స్టాండు నుంచి ఒక గ్లాసు కాఫీ తీసి—దాంట్లో ఉన్న కాఫీని ఒక్కసారిగా విసురుగా పెద్ద జలాయి ముఖాన్ని కాఫీతో ముంచేస్తున్నట్లుగా — కసిగా లోపలికి కొట్టాడు.

వాడు ఖాళీ గ్లాసు దొరికినట్లుగా — కాఫీలకు డబ్బులు దొరికినట్లుగా ఆగిపోయాడు.

పెద్ద జలాయి అవాక్కయి ఎగిరి పడ్డాడు చేతిలో సగం తాగిన కాఫీ గ్లాసుతో!

అక్కడున్న ఎవరికీ నోట మాట పెగల్లేదు.

బిగుసుకుపోయి కూర్చున్నాం.

నేను గమనించనేలేదు... ఒక ముసలికాయన బెర్త్ ఎక్కి ఎప్పుడు పడుకుంటో — పైకి కళ్ళు పెట్టి టాప్ వంకకు చూస్తూనే ఏదో నోట్లోవేసి నములుతూ, "అయితే అబ్బాయీ ... ఇంతకీ ఆ పెళ్ళి వారు భోజనానికి ఉన్నారా వెళ్ళిపోయారా?" అన్నాడు!

★


శీఘ్ర వ్యాధులకు ఉత్తమ శీఘ్ర వైద్యం!



నరముల బలహీనత
కామపుష్టి యువ్వనశక్తి
హెర్నియా శిశ్నవ్యాధులకు
పోస్టు ద్వారా కూడా కలదు
మధుమేహం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి

డా॥ దేవర, బాక్స్ 551, మార్కాపురం

బ్రాంచి: 5/1వ లైను, బ్రాడీపేట, గుంటూరు—2

ఉచితం ఉచితం ఉచితం

# తెల్లమచ్చలు

మా ఆయుర్వేద చికిత్స మచ్చలను తొలగిస్తుంది. మా ఔషధాలను క్రమం తప్ప వాడటంతో చాల కొద్దికాలంలోనే మచ్చల రంగు మారింది. మీరు కూడ మా చికిత్సను తప్పక పరీక్షించాలి. ఒక బుడ్డి మందు ఉచితంగా ఇవ్వబడుతుంది. వెంటనే వ్రాయండి.

Gautam Chikitsalaya (SDP)
P.O. Katrisarai (Gaya)